క్లుప్తంగా

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని నిలిపివేయండి



ఎమ్మెల్యే కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నేతలు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో నిర్మించతలపెట్టిన డా.బీఆర్ అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రానికి కేటాయించిన స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని నిలిపివేయాలని బీఎస్పీ నేతలు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఎస్పీ నేతలు మాట్లాడుతూ.. డా.బీఆర్ అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రానికి 10 గుంటల భూమి కేటాయిస్తే 1987 నుంచి ఆక్రమణలకు గురౌతూ నిర్మాణాలు జరిగాయని వీటిని తొలగించాలని కోరారు. అదేవిధంగా ఇప్పుడు మిగిలిన 400 గజాల స్థలంలో ప్రస్తుతం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారని.. ఈ పనులను నిలిపివేసి అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రాన్ని మాత్రమే నిర్మించాలని విన్నవించారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో రఘుపతి, రాములు, కిష్టన్న, దాసు, కృష్ణ, మహేందర్ ఉన్నారు.

ఏవీఎన్‌రెడ్డిని గెలిపించండి

తపస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి



చెన్నారెడ్డిగూడ పాఠశాలలో ప్రచారంలో ఉపాధ్యాయులు

మంచాల: ఉపాధ్యాయ సమస్యలపై పోరాడే వ్యక్తి ఏవీఎన్ రెడ్డికి ఎమ్మెల్సీ అభ్యర్థిగా మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని తపస్ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి పూజారి రమేష్ కోరారు. బుధవారం మండల పరిధిలోని జాపాల, చెన్నారెడ్డిగూడ, లింగంపల్లి, ఆరుట్ల ప్రభుత్వ పాఠశాలతో పాటు నోముల బీసీ గురుకుల పాఠశాలల్లో ఏవీఎన్ రెడ్డిని గెలిపించాలని ప్రచారం చేశారు. ఆ సంఘం రాష్ట్ర నాయకులు లక్ష్మయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహ, నాయకులు సురేష్‌కుమార్, రవీందర్, వెంకటేష్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

చుక్కాపూర్‌లో పంటల పరిశీలన

తలకొండపల్లి: వ్యవసాయాధికారుల సూచనలు, సలహాల మేరకు యజమాన్య పద్ధతులు పాటించి పంటలను రక్షించుకోవాలని ఏఓ రాజు.. రైతులకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని చుక్కాపూర్‌లో ఆయన పర్యటించారు. రాజుకుమార్, కిషన్ ప్రసాద్ నర్సింహ, వెంకటయ్య, యాదయ్య తదితర రైతులకు చెందిన వరి, మొక్కజొన్న, వేరుశనగ పంటలను పరిశీలించారు. ఎరువులు, తెగుళ్లు, దిగుబడి తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ శ్రీనాథ్, రైతులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి చెందిన కృష్ణయ్య (59) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. బుధవారం బీఆర్‌ఎస్ నాయకుడు గోళి శ్రీనివాస్‌రెడ్డి గట్టుఇప్పలిపల్లిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వ్యక్తిగతంగా రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుభాష్, నాయకులు.. శ్రీను, ప్రశాంత్, రవీందర్, రాజశేఖర్, సాదిక్, మల్లయ్య, రాజవర్ధన్‌రెడ్డి, నిరంజన్ పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం



రథాన్ని లాగుతున్న భక్తులు

కడ్తాల్: ఆమనగల్లు పట్టణంలో శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి రథోత్సవం వైభవంగా కొనసాగింది. ఆలయ ప్రధాన అర్చకులు గూడ కృష్ణామాచార్యుల వేదమంత్రోచ్ఛరణల మధ్య ప్రత్యేకంగా అలంకరించిన రథంపై అలివేలు మంగసమేత వేంకటేశ్వర స్వామి విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్ష

యాచారం: బొక్కల కంపెనీని మూసేయాలని డిమాండ్ చేస్తూ కొత్తపల్లి గ్రామస్తులు చేపట్టిన నిరాహార దీక్ష బుధవారానికి 28వ రోజుకు చేరింది. దీక్షకు పలు పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. గ్రామ ఉపసర్పంచ్ జగన్, వార్డుసభ్యుడు శ్రీనువాస్ పాల్గొన్నారు.

రోడ్డేమో ఇలా.. ప్రయాణం ఎలా?

- కంకర తేలిన బుగ్గతండా–ఎల్లమ్మ తండా రహదారి
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



బుగ్గతండా–ఎల్లమ్మ తండా రోడ్డుపై తేలిన కంకర

మంచాల: మంచాల మండలంలోని ఆరుట్ల నుంచి బుగ్గతండా–ఎల్లమ్మ తండాకు వెళ్లే రోడ్డు కంకర తేలి రాకపోకలు సాగించేందుకు ఏమాత్రం ఉపయోగంగా లేదు. చుట్టు పక్కల తండాలతో పాటు ఐదారు గ్రామాల ప్రజలు ఈ రోడ్డు గుండానే ప్రయాణం చేయాల్సి ఉంటుంది. మంచాల మండల కేంద్రం నుంచి ఆరుట్ల మీదుగా బుగ్గ తండా, ఎల్లమ్మ తండా, బోడకొండ, లోయపల్లి, రంగాపూర్, చీదేడ్, దాద్‌పల్లి గ్రామాలకు చేరుకోవడానికి ఈ మార్గం ఎంతగానో ఉపయోగంగా ఉంటుంది. అలాంటి రోడ్డు నేడు కంకర తేలి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈ రోడ్డుపై బైక్‌పై ప్రయాణం చేయాలంటే వాహనదారులు హడలిపోతున్నారు. ఈ రోడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో జాపాల గ్రామం మీదుగా ఆరుట్ల, మంచాల గ్రామాలకు అధిక సమయంతో పాటు ఎక్కువ డబ్బులు చెల్లించి ప్రయాణించాల్సిన పరిస్థితి. ఆరేళ్లుగా ఈ రోడ్డుపై కంకరతేలి ప్రమాదకరంగా ఉన్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డును తక్షణమే బాగు చేసి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై కంకర తేలింది



నేను నిత్యం బుగ్గతండా–ఎల్లమ్మతండా రోడ్డుపై ప్రయాణిస్తాను. ఈ రోడ్డుగుండా వెళ్తే ఎల్లమ్మ తండా, బోడకొండ, రంగాపూర్, చీదేడ్ గ్రామాలకు త్వరగా చేరుకోవచ్చు. ఎల్లమ్మ తండా నుంచి ఆరుట్లకు జాపాల మీదుగా చుట్టూ తిరిగి పోవాలంటే 15 కిలోమీటర్ల దూరం అవుతుంది. రోడ్డుపై కంకర తేలింది. వెంటనే బాగుచేయాలి.

– శ్రీధర్‌నాయక్, ఎల్లమ్మ తండా

కొత్త రోడ్డు వేయాలి



బుగ్గ తండా–ఎల్లమ్మ తండా వెళ్లే రోడ్డుపై కంకర తేలడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. వాహనాలు పాడవుతున్నాయి.అత్యవసర సమయాల్లో ఆటోలు కూడా వెళ్లలేని పరిస్థితి ఉంది. వెంటనే నిధులు మంజూరు చేసి కొత్త రోడ్డు వేయాలి.

– విష్ణు వర్ధన్‌రెడ్డి, సర్పంచ్, ఆరుట్ల

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి

ఐసీడీఎస్ కార్యాలయాల ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది ధర్నా



ఇబ్రహీంపట్నం: ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నాలో అంగన్‌వాడీ సిబ్బంది

ఇబ్రహీంపట్నం: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు జయలక్ష్మి, కార్యదర్శి కవిత డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లకు ఎస్‌హెచ్‌టీఎస్, ట్రాకర్ లాంటి యాప్‌ల ద్వారా పని ఒత్తిడి పెంచి మానసిక క్షోభకు గురిచేస్తున్నట్లు ఆరోపించారు. అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంలేదని.. ఈఎస్‌ఐ, పీఎఫ్, మెడికల్ లీవులు, వేసవి సెలవులు ఇవ్వడంలేదన్నారు. నెలల తరబడి బిల్లులు చెల్లించడంలేదని మండిపడ్డారు. 2017 సంవత్సరం నుంచి టీఏ, డీఏలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. మొబైల్ యాప్‌లను రద్దు చేసి, రిటైర్మెంట్ బెనిఫిట్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అంగన్‌వాడీలకు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు స్వప్న, ఎల్లేష్, బుగ్గరాములు, బేబీ, వైదేహి, పద్మ, ఆండాలు, పెంటమ్మ, సంగీత, విజయ, జ్యోతి, శంకరమ్మ పాల్గొన్నారు.

కనీస వేతనం కల్పించాలి..

కడ్తాల్: అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు గుమ్మడి కరుమయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం ఆమనగల్లు పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సీఐటీయూ టాధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు కనీస వేతనం, పెన్షన్, ఈఎస్‌ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు అనసూయమ్మ, విజయలక్ష్మి, లక్ష్మి, సువర్ణ, శారదమ్మ, రాములమ్మ, రజిత, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధించి తీరుతాం

మాదిగ అమరవీరులకు ఎమ్మార్పీఎస్ నేతల నివాళి



యాచారం: మాదిగ అమరవీరుల చిత్రపటాలకు నివాళి అర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

యాచారం: తెలంగాణ ఉద్యమం, ఎస్సీ రిజర్వేషన్ ఏబీసీడీ వర్గీకరణ సాధించే క్రమంలో ప్రాణాలు కోల్పోయిన మాదిగ అమరవీరుల త్యాగాలు వృథా కానివ్వమని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి సిద్ధపురం శ్రీకాంత్ అన్నారు. ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం యాచారం మండల కేంద్రంలో మాదిగ అమరవీరుల దినత్సోవాన్ని నిర్వహించారు. మాదిగ అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణ సాధించి తీరుతాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ నియోజకవర్గం ఇన్‌చార్జి పాండు, ఎమ్మార్పీఎస్ యాచారం మండల అధ్యక్షుడు మహేష్, నాయకులు మహేష్, మందలింగం, ఆనంద్, మహేందర్, విక్రమ్, శంకర్, ఎల్లయ్య, జోగు మరియమ్మ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం అసువులు బాసిన అమరులకు మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్ నాయకులు బుధవారం నివాళులు అర్పించారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద మాదిగ వీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కోకన్వీనర్ కృష్ణ, శ్రీకాంత్, సర్పంచ్ లలిత, నాయకులు జ్యోతయ్య, రాజు, మహేష్, కుమార్, రవితేజ, నారాయణ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు పరాభవం తప్పదు

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్ రెడ్డి

తుర్కయంజాల్: హామీలను విస్మరించిన బీఆర్‌ఎస్ పార్టీకి రానున్న ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొంపల్లి మోహన్ రెడ్డి అన్నారు. పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లో శక్తి కేంద్రం ఇన్‌చార్జి కొండ్రు పురుషోత్తం, నోముల కార్తీక్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా గోస–బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. పురపాలక సంఘం పరిధిలోని తుర్కయంజాల్, ఇంజాపూర్, మునగనూర్, తొర్రూర్‌లోని దళితులకు చెందిన భూములను లాక్కుని హెచ్‌ఎండీఏ వెంచర్లు చేసి డబ్బులు దండుకుంటున్నారని ఆరోపించారు. వారి తరఫున బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. బీఆర్‌ఎస్‌కు పరాభవం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దయానంద్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అర్జున్ రెడ్డి, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ధరావత్ శ్రీనివాస్‌నాయక్, మున్సిపాలిటీ అధ్యక్షుడు తూళ్ల నర్సింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌కు అవార్డుల పంట



ఎంఏ పాషాను సన్మానిస్తున్న సభ్యులు

కడ్తాల్: సామాజిక సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతున్న లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లుకు అవార్డుల పంట పండింది. తోడేటి చెన్నారెడ్డి గార్డెన్‌లో బుధవారం జరిగిన 'విజయం రీజియన్ మీట్‌లో' లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు పలు అవార్డులను సొంతం చేసుకుంది. రీజియన్ ఎక్స్‌లెంట్ క్లబ్‌గా లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు నిలవడంతో పాటు, ఉత్తమ అధ్యక్షుడిగా ఆమనగల్లు క్లబ్ భైరి కరుణాకర్‌రెడ్డి, ఎక్స్‌లెంట్ కార్యదర్శిగా కుడుముల భాస్కర్‌రెడ్డి, ఎక్స్‌లెంట్ ట్రెజరర్‌గా కొండల్‌రెడ్డి, లయన్ ఆఫ్ రీజియన్‌గా సంపత్, ఉత్తమ పీఆర్‌ఓగా ఎంఏ.పాషా అవార్డులు సొంతం చేసుకున్నారు. రీజియన్ చైర్‌పర్సన్ బావండ్ల వెంకటేశ్ చేతుల మీదుగా వారు అవార్డులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రఘు, ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ హరినారాయణ, కోటేశ్వరరావు, నందడి నరేందర్‌రెడ్డి, రమేశ్‌బాబు, చెన్నకిషన్‌రెడ్డి, వెంకటస్వామి, రాంరెడ్డి, నరేశ్, వెంకటేశ్వరెడ్డి, వెంకట్‌రెడ్డి, బాలకృష్ణ, సునంద, వెంకటేశ్వర్లుగౌడ్, భాస్కర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రూ.2319 కోట్లతో అభివృద్ధి పనులు



పాదయాత్రలో ప్రశాంత్ కుమార్‌రెడ్డి, బీఆర్‌ఎస్ శ్రేణులు

బీఆర్‌ఎస్ యువనేత ప్రశాంత్ కుమార్‌రెడ్డి

తుర్కయంజాల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ ఎనిమిదిన్నరేళ్ల పాలనలో నియోజకవర్గంలో రూ.2319 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఆ పార్టీ యువనేత మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆయన చేపట్టిన ప్రగతి నివేదన పాదయాత్ర బుధవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీకి చేరుకుంది. ఔటర్ రింగ్ రోడ్డు చౌరస్తాలో 500 కిలోమీటర్ల మైలురాయిని దాటింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పైలాన్‌ను ఆవిష్కరించారు. తుర్కయంజాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రశాంత్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నప్పటికీ తుర్కయంజాల్ మున్సిపల్ పాలకవర్గం అభివృద్ధి నిరోధకులుగా మారారని ఆరోపించారు. ప్రజల కష్టసుఖాలు తెలుసుకునేందుకే పాదయాత్ర చేపడుతున్నాని అన్నారు. రానున్న రోజుల్లో ప్రజలు కేసీఆర్ నాయకత్వానికి మద్దతు తెలిపితే మరింత అభివృద్ధి చేసి చూపెడతామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ కల్యాణ్ నాయక్, యువజన విభాగం అధ్యక్షుడు కొత్తకుర్మ కార్తీక్, నాయకులు సురేందర్‌రెడ్డి, సంపతీశ్వర్ రెడ్డి, శ్రీనివాస్, విజయానందరెడ్డి, యాదిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నారాయణపురం బస్సు పునఃప్రారంభం



బస్సు సర్వీస్‌ను ప్రారంభిస్తున్న నేతలు, అధికారులు

మంచాల: బండలేమూర్–నారాయణపురం ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను ఎట్టకేలకు బుధవారం పునఃప్రారంభించారు. ఐదేళ్ల క్రితం ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో నుంచి బండలేమూర్ మీదుగా యాదాద్రి జిల్లా నారాయణపూర్ మండల కేంద్రానికి ఆర్టీసీ బస్సు నడిచేది. ఈ బస్సు రెండు జిల్లాలోని సరిహద్దు గ్రామాల మీదుగా రాకపోకలు సాగించేంది. అప్పట్లో డిపో మొత్తంలో అధిక ఆదాయం తీసుకొచ్చే బస్సు సర్వీస్ కూడా ఇదే. మూడేళ్ల క్రితం వర్షాల కారణంగా ఈ మార్గంలోని రోడ్డు పాడైపోవడంతో బస్సు సర్వీస్‌ను బంద్ చేశారు. దీనికి కరోనా కూడా తోడవ్వడంతో ప్రజలు కూడా తిరిగి బస్సు గురించి పెద్దగా పట్టించుకోలేదు. 20 రోజుల క్రితం బండలేమూర్ గ్రామస్తులు రాష్ట్ర ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను కలిసి ఈ రూట్లో బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని కోరారు. సజ్జనార్ ఆదేశాల మేరకు ఆర్టీసీ అధికారులు తాజాగా తిరిగి బస్సును పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా బండలేమూర్ గ్రామస్తులు బస్సుకు ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయాల నిర్మాణంతో గుర్తింపు



ప్రహరీ పనులకు భూమిపూజ చేస్తున్న కోదండరెడ్డి

మాజీ ఎమ్మెల్యే కోదండరెడ్డి

యాచారం: నందివనపర్తి గ్రామం భవిష్యత్తులో మహా పుణ్య క్షేత్రంగా మారబోతుందని మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి అన్నారు. సొంత నిధులతో నందివనపర్తి గ్రామంలోని స్వయంభు సిద్ధేశ్వరాలయానికి ప్రహరీని కోదండరెడ్డి, సావిత్రమ్మ దంపతులు నిర్మిస్తున్నారు. ప్రహరి నిర్మాణ పనులకు బుధవారం వారు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా కోదండరెడ్డి మాట్లాడుతూ... నందివనపర్తి గ్రామంలో పూరాతన సిద్ధేశ్వరాలయం, ఓంకారేశ్వరాలయం, నందీశ్వరాలయం, నూతనంగా నిర్మించే శ్రీ జ్ఞాన సరస్వతీ మాత దేవాలయంతో భవిష్యత్తులో గొప్ప పుణ్య క్షేత్రంగా మారబోతుందని అన్నారు. ఏళ్ల కింద సిద్ధేశ్వర స్వామికి మొక్కుకున్నట్లు ఆయన మొక్కు తీర్చుకోవడం కోసం నేడు ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నందివనపర్తి గ్రామ సర్పంచ్ ఉదయశ్రీ, బీఎన్‌ఆర్ ట్రస్టు చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

కడ్తాల్: కడ్తాల్ మండలానికి చెందిన రాముకి రూ.22 వేలు, ఆమనగల్లు మండలం శెట్టిపల్లి గ్రామానికి చెందిన రజితకు రూ.36 వేలు, రాములుకు రూ.28 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు నరేశ్‌నాయక్, శంకర్, రంగయ్య, మోత్యానాయక్ తదితరులు ఉన్నారు.

వెల్జాల్‌కు చెందిన రవికి..

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్‌కు చెందిన బోయ రవికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో రూ.42,000 సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. బుధవారం మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌యాదవ్ బాధిత కుటుంబ సభ్యులకు ఆ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు.. యాదయ్య, దస్తగిరి, బందులాల్, వెంకటయ్య, రవి, రాఘవెందర్, కిరణ్, శేఖర్, ఆరీఫ్, సుల్తాన్ పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డుల పరిశీలన

యాచారం: మండల పరిధిలోని నందివనపర్తి గ్రామంలో బుధవారం ఎంపీడీఓ విజయలక్ష్మి పర్యటించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులు, ఖర్చు వివరాల నమోదు రికార్డులను పరిశీలించారు. అదే విధంగా పన్నుల వసూలు, పంచాయతీ సిబ్బంది జీతాల చెల్లింపుల రికార్డులను పరిశీలించారు. అనంతరం పల్లె ప్రగతి పనులను, నర్సరీని సందర్శించారు. మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రజా స్పందన చూసి ఓర్వలేకనే దాడులు

బీఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ నేత శ్రీనివాస్‌రెడ్డి ఫైర్

కడ్తాల్: టీపీసీసీ చీఫ్, ఎంపీ రేవంత్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రకు ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి ఓర్వలేకనే బీఆర్‌ఎస్ నాయకులు దాడులు చేస్తున్నారని డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. బుధవారం కడ్తాల్‌లో ఆయన మాట్లాడుతూ.. భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగిన సభలో రేవంత్‌రెడ్డి ప్రసంగిస్తున్న సమయంలో.. దొంగచాటుగా బీఆర్‌ఎస్ నాయకులు దాడిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడులకు భయపడేది లేదన్నారు. మరోసారి పునరావృతమైతే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

వైద్య శిబిరానికి ఆదరణ

మాడ్గుల: కల్వకుర్తి నియోజకవర్గంలో నిరుపేదలకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు ద్వారా ఇళ్లు నిర్మించి ఇస్తున్నామని తలకొండపల్లి జెడ్పీటీసీ సభ్యుడు, ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అన్నారు. మాడ్గుల మండలంలోని ఆర్కపల్లిలో బుధవారం హైదరాబాద్ కామినేని ఆస్పత్రి సౌజన్యంతో ఉప్పల ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరాన్ని ఉప్పల వెంకటేశ్ స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 249 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరానికి విశేష స్పందన వచ్చిందన్నారు. మండలంలోని ఇర్విన్‌లో గురువారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు జంగయ్య, గోపాల్‌నాయక్, హనుమాన్‌నాయక్, ఉపసర్పంచ్ బిక్కుగౌడ్, ఎస్‌ఎంసీ చైర్మన్ తిరుపతయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

కడ్తాల్: మండల పరిధిలోని రావిచేడ్ గ్రామంలో కొలువైయున్న శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుండి ప్రారంభం కానున్నాయి. ఐదురోజుల పాటు ఈ ఉత్సవాలు కొనసాగుతాయని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

కార్మిక హక్కులను కాలరాస్తున్నారు



ఏఎల్‌ఓకు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నేతలు

సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు కిషన్

ఇబ్రహీంపట్నం: వివిధ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించడంతో పాటు 8 గంటల పనిదినాన్ని అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు డి.కిషన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఇబ్రహీంపట్నం అసిస్టెంట్ లేబర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్మికులందరికీ ఈఎస్‌ఐ, పీఎఫ్, గ్రాట్యూటీ, బోనస్ ఇవ్వాలన్నారు. వివిధ పరిశ్రమల్లో చట్టపరమైన హక్కులను కల్పించడంలో యాజమన్యాలు నిర్లక్ష్యం వహిస్తున్నట్లు ఆరోపించారు. కార్మిక శాఖ ఆదేశాలు తుంగలో తొక్కి 12 గంటలు పనిచేయించుకుంటూ యాజమన్యాలు లాభాలు గడిస్తున్నట్లు తెలిపారు. కార్మిక హక్కులను కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేవారు. వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఏఎల్‌ఓ ఆంజనేయులుకు సీఐటీయూ నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు కవిత, ప్రతాప్, యాదగిరి, కృష్ణ, శివప్రసాద్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, శంకర్, మనోహర్ పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాయకులు

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: బీఆర్‌ఎస్ పార్టీ అభివృద్ధికి కృషిచేసే ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్ జన్మదిన వేడుకలకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. పార్టీకి కార్యకర్తలే కీలకమని.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, ఉపసర్పంచ్ రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.